بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 06 March 2026 (Telugu)

# మధ్యప్రాచ్యం (మిడిల్ ఈస్ట్)లో కొనసాగుతున్న ప్రస్తుత యుద్ధ నేపథ్యంలో ముస్లిం సమాజానికి ముఖ్యమైన ఉపదేశాలు

**హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 06.03.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ أَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

ఏకేశ్వరుడైన అల్లాహ్‌పై విశ్వాసం ఉంచడం, అతన్ని ఆరాధించడం, అతని ఏకత్వాన్ని (తౌహీద్) స్థాపించడం మరియు దాని కోసం కృషి చేయడం, ఇలాగే అతని సృష్టి (ప్రజల) హక్కులను నెరవేర్చడానికి ప్రయత్నించడం. ఆపై ఒకే సమాజంగా ఏర్పడి పరస్పరం సోదరభావంతో కలిసి మెలిసి ఉండటమే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తీసుకువచ్చిన సందేశం ఉద్దేశ్యం.

అయితే నేడు మనం కలిమా చదువుతున్నామని చెప్పుకుంటున్నప్పటికీ మనం ఒక ఐక్య శక్తిగా లేము. మన ఆచరణలు మనం చెప్పుకునే బోధనలకు అనుగుణంగా లేవు. ఫలితంగా మనం ఇస్లామీ ప్రపంచాన్ని పరిశీలిస్తే పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంది. కొన్ని దేశాల వద్ద సహజ వనరులు, అపారమైన సంపద ఉన్నప్పటికీ ప్రపంచ దేశాల ముందు వారికి ఎటువంటి ప్రత్యేక స్థానం లేదు. అటు ధర్మ అభివృద్ధిలో కానీ ఇటు ఇస్లామీ బోధనలను అమలు చేయడంలో కానీ వారి కృషి కనబడటం లేదు. దీని ఫలితం స్పష్టంగా కనిపిస్తోంది. ఇతరులు ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

ముస్లింలందరూ ఒకే ఇస్లామీ జాతిగా ఏకం కావడానికి గట్టిగా కృషి చేయవలెను. మనం అలా ఐక్యం అయినప్పుడు మాత్రమే ప్రపంచం నుండి ఎదురయ్యే దాడుల నుండి మనల్ని మనం రక్షించుకోగలం, మన గౌరవాన్ని నిలబెట్టుకోగలం, ఇస్లాం వ్యతిరేక శక్తులు మనల్ని విచ్ఛిన్నం చేయకుండా అడ్డుకోగలం. ఇందుకు అల్లాహ్ తఆలా ఈ కాలంలో మన కోసం ఎటువంటి ఏర్పాట్లు చేశాడో మనం ఆలోచించవలెను. అల్లాహ్ తఆలా ఈ గొప్ప లక్ష్యం కోసమే మసీహ్ మౌఊద్ మరియు మెహదీ మౌఊద్ అలైహిస్సలాంను పంపాడు.

నేను గత కొంతకాలంగా ప్రజల దృష్టిని ఒక విషయం వైపు మళ్ళిస్తూనే ఉన్నాను. గతంలో నా మాటలు విని మీరు ప్రపంచం గురించి చాలా నిరాశాజనకమైన, ప్రతికూలమైన అంచనాలు వేస్తున్నారు, ప్రపంచం ప్రమాదకరమైన యుద్ధంలో చిక్కుకుంటుందని భయపెడుతున్నారని అన్నవారే ఈ రోజు స్వయంగా ఇలా అంటున్నారు. కొన్ని ఏళ్ళ క్రితం వరకు మేము ఏదైతే అసాధ్యమని భావించామో, ఇప్పుడు అదే సాధ్యమైంది, యుద్ధాలు మొదలయ్యాయి.

పాశ్చాత్య శక్తులు మొదట ఇస్లామీ దేశాల మధ్య చిచ్చు పెట్టి ఒకరితో ఒకరిని పోరాడేలా

చేశాయి ఇప్పుడు వారి వనరులను హస్తగతం చేసుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నాయి. ఈ ‘దజ్జాలీ’ (దుష్ట) శక్తులు ముస్లింలు ఎన్నటికీ ఐకమత్యంగా ఉండటాన్ని చూడలేవని ముస్లింలు గ్రహించ వలెను. ముస్లింల మధ్య నిరంతరం కలహాలు, గందరగోళం సృష్టించడమే వారి అసలు ఉద్దేశ్యం.

అమెరికా అనేక ఇస్లామీ దేశాలలో తన సైనిక స్థావరాలను ఏర్పాటు చేసింది, కానీ ఎందుకు? ఆ దేశాల రక్షణ కోసమా? అసలు ఆ అరబ్ దేశాలకు ఎవరి నుండి ముప్పు ఉంది? ఈ (పాశ్చాత్య) శక్తులు స్వయంగా ముప్పులను సృష్టించాయి, ఆపై ముస్లిం దేశాలకు మీకు ప్రమాదం ఉంది, అందుకే మీ రక్షణ కోసం ఈ ఏర్పాట్లు చేస్తున్నామనే భ్రమను కలిగించాయి. ముస్లిం దేశాలకు నిజంగా ఎవరి నుండి అయితే ముప్పు ఉందో, వారికి వ్యతిరేకంగా ఈ సైనిక స్థావరాలను వారు ఎన్నటికీ ఉపయోగించరు.

ఇరాన్ ఎప్పుడూ ఈ దేశాలకు కంటగింపుగానే ఉండేది. ఇజ్రాయెల్ పట్ల ఇరాన్ అనుసరిస్తున్న విధానం చాలా కఠినంగా ఉండేది, పైగా ఇతర ఇస్లామీ దేశాలతో విశ్వాసాల పరంగా విభేదాలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితులన్నింటినీ ప్రపంచ శక్తులు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి మరియు ఈ ప్రాంతంలో తమ ఉనికిని ఏర్పాటు చేసుకున్నాయి. ఈ సైనిక స్థావరాల వల్లే అరబ్ దేశాలపై దాడులు జరిగే ప్రమాదం ఏర్పడింది మరియు దాడులు జరిగాయి కూడా. ఈ దాడుల వల్ల అరబ్ దేశాల ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమయ్యాయి. ఈ పరిస్థితి వల్ల ప్రపంచ శక్తులే లాభపడ్డాయి మరియు భవిష్యత్తులో కూడా లాభపడతాయి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్(రాబి రహిమహుల్లా ఇరాక్ యుద్ధం సమయంలోనే ఈ కలహాలు, కుట్రలు ఇకపై పెరుగుతూనే ఉంటాయి అని హెచ్చరించారు. ముస్లిం దేశాలు దీని నుండి పాఠం నేర్చుకుంటే ఎంత బాగుండేదో!

ఈ అశాంతిని వ్యాపింపజేసింది ఈ ప్రపంచ శక్తులే, ప్రస్తుతానికి ఇది ఆగిపోయే సూచనలేమీ కనిపించడం లేదు. అల్లాహ్ ప్రత్యేక సంకల్పం ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు. అయితే దీని కోసం ముస్లింలు తమ వంతు కృషి చేయవలెను, మనం దీని గురించి ప్రార్థనలు కూడా చేయవలెను. ఈ అన్యాయం రోజురోజుకూ పెరుగుతున్న తీరు చూస్తుంటే ఒక భారీ స్థాయి ప్రపంచ యుద్ధం జరగబో తోందనిపిస్తోంది. నిజానికి కొంతమంది పాశ్చాత్య విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ప్రపంచ యుద్ధం ఇప్పటికే మొదలైపోయింది. నేను కూడా ఇదే చెబుతున్నాను. యుద్ధం ఇప్పటికే ప్రారంభమైంది. అయితే, ఇప్పటికైనా ముస్లిం ప్రపంచం వివేకంతో ఆలోచిస్తే ఈ దజ్జాల్ కుట్రల నుండి సురక్షితంగా ఉండవచ్చు.

మధ్యప్రాచ్యం (Middle East)లో జరుగుతున్న యుద్ధం విషయానికి వస్తే అమెరికా ఇరాన్‌పై దాడి చేయడం ద్వారా దీనిని ప్రారంభించిందని చెప్పవచ్చు. అయితే మాపై దాడి జరిగితే అరబ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఎదురుదాడి చేస్తామని ఇరాన్ ముందే హెచ్చరించింది, ఇలాగే జరిగింది కూడా. వీరు ‘పాలన మార్పు’ అని నినాదాలు చేశారు, కానీ దీనివల్ల సాధించిందేమిటి? ఖామేనీ గారికి అమరత్వపు (షాహదత్) హోదా లభించింది మరియు ఆయన గౌరవం మరింత పెరిగింది. ఆయన కుటుంబం మొత్తాన్ని చంపడం ద్వారా పాలన ఎలా మారుతుంది? పైగా వారి జాతి మరింత ఐక్యమైంది. మధ్యప్రాచ్యంలోని అరబ్ దేశాలకు స్వంత రక్షణ సామర్థ్యం లేదు, వారు పూర్తిగా పాశ్చాత్య శక్తులపైనే ఆధారపడి ఉన్నారు. ఈ యుద్ధం ఇప్పుడు భయంకరమైన రూపాన్ని సంతరించుకుంది.

అరబ్ దేశాలకు ఒకవైపు చమురు బావులు మూతపడటం వల్ల నష్టం జరుగుతోంది, ధరలు పెరుగుతున్నాయి. మరోవైపు ఈ యుద్ధంలో అమెరికా కల్పిస్తున్న రక్షణ సౌకర్యాలకు అయ్యే ఖర్చును

కూడా వారే చెల్లించాల్సి ఉంటుంది. దీనివల్ల అరబ్ ప్రపంచపు ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది.

అమెరికా అధ్యక్షుడు మునుపటి అమెరికన్ ప్రభుత్వాల విధానాలనే అనుసరిస్తున్నారు. ఇది కేవలం ఇప్పటి పాలసీ మాత్రమే కాదు చాలా కాలంగా ఉన్నదే. తమకు నచ్చిన చోట ఆ ప్రాంత వనరులను హస్తగతం చేసుకోవడం మరియు దాని కోసం ఏదో ఒక సాకును (అది ఇదని లేదా ఇది అదని) చూపించడం వారి పద్ధతి. ఏ దేశమైతే వారికి సహకరించదో ఆ దేశాన్ని బెదిరింపులు మరియు బలప్రయోగంతో తమ దారికి తెచ్చుకుంటారు.

యూరోపియన్ పార్లమెంటులో ఒక స్పెయిన్ దేశపు మహిళా ఎంపీ చాలా బహిరంగంగా ఒక ప్రకటన చేశారు. అమెరికా చేసిన ఏ యుద్ధం వల్ల కూడా మహిళలకు స్వాతంత్ర్యం లభించలేదని ఆమె స్పష్టం చేశారు. ఆమె స్వయంగా మహిళ కాబట్టి, మహిళల సమస్యను లేవనెత్తారు. మేము ఇరానీ మహిళల స్వేచ్ఛ కోసం పోరాడుతున్నాం అని అమెరికన్లు చేస్తున్న వాదన అంతా అబద్ధమని ఆమె అన్నారు. దీనివల్ల ఇరానీ మహిళలకు ఎన్నటికీ స్వేచ్ఛ లభించదు. అమెరికా ఎప్పుడూ మహిళల స్వేచ్ఛ కోసం యుద్ధం చేయలేదు అందులో వారు ఎప్పుడూ విజయం సాధించలేదు.

ఎక్కడైతే న్యాయం ఉండదో అక్కడ వినాశనం తప్పదు. ఈ శక్తులు వందలాది మంది పిల్లలను మరియు అమాయకులను చంపివేశాయి. పిల్లల పాఠశాలలపై బాంబులు కురిపించారు. ఇది ఎటువంటి యుద్ధం? ఇంత జరుగుతున్నా వారిని ప్రశ్నించే వారే లేరు.

ఇస్లాం ధర్మం దేవుని ఏకత్వాన్ని (తౌహీద్) స్థాపించడానికి వచ్చింది. ముస్లిం దేశాలన్నీ ఇదే లక్ష్యం కోసం కృషి చేయవలెను, ఐక్యంగా ఉండవలెను. ఈ శక్తివంతమైన దేశాలను (పాశ్చాత్య దేశాలను) మీ దేవుళ్ళుగా భావించకండి. లేదంటే ఈ దేశాలు ఒక్కొక్కటిగా అన్ని ఇస్లామీయ దేశాలను మరియు వారి వనరులను హస్తగతం చేసుకుంటాయి.

ముస్లింలకు పవిత్ర ఖుర్ఆన్ స్పష్టమైన మార్గదర్శకత్వం ఇచ్చింది. విశ్వాసుల రెండు పక్షాలు ఒకరితో ఒకరు పోరాడుకుంటే వారి మధ్య సంధి చేయండి. ఒకవేళ సంధి జరిగిన తర్వాత కూడా ఒక పక్షం మరొకరిపై దాడికి దిగితే, ఆ అన్యాయం చేసే బృందం అల్లాహ్ తఆలా ఆజ్ఞ వైపునకు (శాంతి వైపునకు) మరలి వచ్చేవరకు అందరూ కలిసి వారిపై పోరాడండి. వారు అల్లాహ్ ఆజ్ఞకు లోబడినప్పుడు, ఆ రెండు పక్షాల మధ్య పూర్తి న్యాయంతో రాజీ కుదర్చండి.

ప్రపంచ శాంతికి ఈ ఆదేశం ఎంతో అవసరం. ముస్లింలకు దీని ప్రాముఖ్యత ఇంకా ఎక్కువ గలదు. ఎందుకంటే అల్లాహ్ తఆలా స్వయంగా పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ మార్గదర్శకత్వాన్ని ఇచ్చాడు. రాజీ (సంధి) కుదిర్చేటప్పుడు మన వ్యక్తిగత ప్రయోజనాలను చూడకూడదు, అసలు సమస్యను పరిష్కరించడం పైనే దృష్టి పెట్టాలి. చైనా మరియు మరికొన్ని దేశాలు రాజీ కోసం ముందుకొచ్చాయి. ఇరాన్‌తో సహా అరబ్ దేశాలన్నీ ఈ దిశగా ఆలోచించాలి.

ముస్లిం ప్రపంచం ఈ విషయాన్ని గ్రహించాలని, అల్లాహ్ వారికి వివేకాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ఏదేమైనా ముస్లిం ప్రపంచం కోసం మరియు అమాయకుల కోసం ప్రార్థించడం (దుఆ చేయడం) మన బాధ్యత. ముఖ్యంగా ఈ రమజాన్ మాసంలో కేవలం మీ వ్యక్తిగత అవసరాల కోసం మాత్రమే ప్రార్థించకండి, ముస్లిం ఉమ్మత్ (సమాజం) కోసం కూడా దుఆ చేయండి. అల్లాహ్ తఆలా వారికి సద్బుద్ధిని ప్రసాదించుగాక! తద్వారా ప్రపంచంలో ముఖ్యంగా ముస్లిం దేశాల్లో శాంతి

నెలకొనుగాక! ఒక ముస్లిం మరొక ముస్లిం ప్రాణాన్ని తీసే పరిస్థితి ఉండకూడదు. ఈ విధంగా పరస్పరం పోరాడుకుంటూ తప్పుడు మార్గంలో హత్యలు చేసుకుంటున్న వారు అల్లాహ్ తఆలా ఆగ్రహానికి గురవుతున్నారు. ఇటువంటి వారు ఈ లోకంలోనే కాకుండా పరలోకంలో కూడా నష్టపోతారు. అందుకే ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అల్లాహ్ తఆలా మనకు నిజమైన రీతిలో ప్రార్థనలు చేసే భాగ్యాన్ని ప్రసాదించుగాక.

జుమా ఖుత్బా (ప్రసంగం) రెండవ భాగంలో హుజూరె అన్వర్ ఇటీవల మరణించిన ముగ్గురి గురించి ప్రస్తావిస్తూ వారి పరోక్ష అంత్యక్రియల ప్రార్థన చదివిస్తానని ప్రకటించారు.

(1) గౌరవనీయురాలు సాహిబ్జాదీ అమతుల్ జమీల్ సాహిబా. ఈమె హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు గారి కనిష్ట (అందరికంటే చిన్న) కుమార్తె మరియు నాసిర్ మహ్మూద్ సియాల్ గారి ధర్మపత్ని. హజ్రత్ చౌదరి ఫతేహ్ ముహమ్మద్ సియాల్ రజియల్లాహు అన్హు గారి కోడలు. ఈమె హజ్రత్ సయ్యదా మరియం బేగం సాహిబా (ఉమ్మే తాహిర్) గారి కుమార్తె. హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు సంతానంలో కూడా ఈమె అందరికంటే చిన్నవారు. 1955వ సం॥లో హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్హు స్వయంగా ఈమె నికాహ్ (వివాహ ఒప్పందం) చదివించారు. ఈమెకు నలుగురు సంతానం. మృతురాలు పేదలను ఆదరించేవారు, ప్రార్థనలు చేసేవారు మరియు ఎంతో పుణ్యమూర్తి అయిన మహిళగా పేరుపొందిరి.

(2) గౌరవనీయులు డాక్టర్ రషీద్ అహ్మద్ ఖాన్ గారు(హాలెండ్). వీరు గౌరవనీయులు నిజాముద్దీన్ గారి కుమారుడు. వీరు ఇటీవల 91 ఏళ్ల వయసులో మరణించారు. (ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్). మృతునికి నలుగురు కుమారులు మరియు నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీరు పుణ్య స్వభావం కలవారు, నిర్భయులు, దైవభీతి గలవారు, స్నేహశీలి, బంధుత్వాలను గౌరవించేవారు, ఖిలాఫత్ పట్ల అమితమైన ప్రేమ కలవారు మరియు త్యాగానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే వారు. వీరికి ఇస్లాం సందేశాన్ని ఇతరులకు అందించడం (తబ్లీగ్) అంటే చాలా ఆసక్తి ఉండేది.

(3) గౌరవనీయురాలు జైనబ్ బీబీ సాహిబా. ఈమె చక్ కర్తార్‌పూర్ మాజీ సదర్ జమాఅత్ కీ॥శే॥ బషీర్ అహ్మద్ గారి ధర్మపత్ని. ఈమె ఇటీవల 85 ఏళ్ల వయసులో మరణించారు. (ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్). ఈమె మూసియా కూడా. ఈమె తహజ్జుద్ ప్రార్థనలు చేసేవారు, ఇతరుల కోసం దుఆ చేసేవారు మరియు పవిత్ర ఖుర్ఆన్ పారాయణం చేసే పుణ్య స్వభావం గల మహిళ. ఈమె కుమార్తె ఒక ముబల్లిగ్ భార్య. జాంబియాలోని లుకాసాలో ఉంటున్నందున ఆమె తన తల్లి అంత్యక్రియల్లో పాల్గొనలేకపోయారు.

హుజూరె అన్వర్ మృతిచెందిన వారందరి పాపక్షమాపణ కోసం, పరలోకంలో వారి స్థాయి అంతస్తుల పెరుగుదల కోసం ప్రార్థించారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ ـ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا ـ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ ـ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ ـ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ ـ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ ـ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ـ